నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 19 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కాంగ్రెస్‌తో రైతులకు ప్రమాదం

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, అక్టోబర్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతుబంధు, రైతులకు ప్రమాదం పొంచి ఉందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం అదిలాబాద్ రూరల్ మండలంలోని ఎంపీటీసీల పరిధిలో గల యాపలగూడలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల పక్షాన చేపడుతున్న నిరసన సభ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా రైతులకు మద్దతుగా ప్రతి ఒక్కరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన స్వలాభం కోసం బీజేపీ కండువా కప్పుకుని కాంగ్రెస్ నాయకులతో రెండు నాలుకల ధోరణికి పాల్పడుతున్నారన్నాని మండిపడ్డారు. భారతదేశంలోనే నాణ్యత ప్రమాణాల్లో మెరుగైన ఆదిలాబాద్ పత్తి కొనుగోళ్లపై స్థానిక బీజేపీ నాయకులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. గుజరాత్ తరహాలో ఆదిలాబాద్ పత్తికి ధర కల్పించాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేసినప్పటికీ రేవంత్‌రెడ్డి రుణమాఫీ అందించడం పూర్తయిపోయిందంటూ ప్రధానికి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోకండ్ల రమేశ్, ఇజ్జగిరి నారాయణ, పెందర్ గంగయ్య, దుర్గం రాంచందర్, జయరాం, మామిళ్ల భూమన్న పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## ఆదిలాబాద్ పత్తికి గుజరాత్ తరహా ధర చెల్లించాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

జైనథ్, అక్టోబర్ 18 : గుజరాత్ కంటే ఆదిలాబాద్ పత్తికి తక్కువ ధర కేటాయించడంపై బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 24న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు హాజరు కానున్న నేపథ్యంలో శుక్రవారం మండలంలోని సాత్నాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశాల్లో జోగు రామన్న పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఊరూవాడా పార్టీ నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రత్యేకంగా సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి కేటీఆర్ సభ విజయవంతం అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రోకండ్ల రమేశ్, మాజీ ఎంపీటీసీ పెందుర్ దేవన్న, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, మార్శెట్టి గోవర్ధన్, పెందూర్ భరత్, గంగయ్య, విజయ్ సెట్, లక్ష్మణ్, రేణుక భాయ్, శ్రీరాం, పుచ్చన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రిమ్స్‌లో ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఆల్ ఇండియా కోటా మూడో విడుతలో ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆల్ ఇండియా కోటాలో దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది విద్యార్థులను రిమ్స్‌కు కేటాయించారు. పలువురు అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు తీసుకున్నారు. కౌన్సెలింగ్‌లో నోడల్ అధికారి ప్రశాంత్‌రెడ్డి, సిబ్బంది రాకేశ్ పాల్గొన్నారు.



రిమ్స్‌లో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రొఫెసర్లు



చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

## మత్స్యకారులకు ఉపాధి గండం

- సగం చేప పిల్లల పెంపకం
- గతేడాది 1.23 కోట్ల చేప పిల్లల పంపిణీ
- ఈసారి 60 లక్షలు మాత్రమే..
- ఇంకా చెరువుకు చేరని చేప

ఆదిలాబాద్, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం కులవృత్తుల ప్రోత్సాహకానికి చేయూతనందించింది. గొల్ల, కుర్మలకు 75 శాతం సబ్సిడీపై గొర్రెలు, మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గొర్రెల పంపిణీ నిలిపివేసి, చేపపిల్లల పంపిణీలో భారీగా కోత విధించింది. ఏటా వానకాలం మధ్యలో చెరువులు, ప్రాజెక్టులు నిండిన తర్వాత మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా.. వానకాలం ముగిసి 20 రోజులు గడుస్తున్నా పంపిణీని ప్రారంభించలేదు. దీంతో నీటి వనరుల్లో వదిలిన చేప పిల్లలు పెరిగే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఉదాసీనత వైఖరి కారణంగా మత్స్యకారులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకున్నది.

### కేసీఆర్ హయాంలో అన్ని విధాలా సహకారం

బీఆర్ఎస్ ప్రభుత్వం నీలి విప్లవంలో భాగంగా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. చేపలు పట్టడానికి వలలు, ఇతర సామగ్రి, మార్కెటింగ్ కోసం ఫోర్, టూ వీల్లర్ వాహనాలను అందజేసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సహకారంతో మత్స్యకారుల ఉపాధి మెరుగుపడింది. జిల్లాలో 95 మత్స్య సహకార సంఘాలు ఉండగా.. వీటిలో 4,500 మంది సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లల ఫలితంగా వీరికి ఉపాధి లభించింది. గతేడాది 224 చెరువుల్లో 1.23 కోట్ల చేప పిల్లలను వదిలారు. సాత్నాల, మత్తడి ప్రాజెక్టులతోపాటు చెరువుల్లో వేసిన చేప పిల్లలు బాగా పెరిగాయి. ఈ ఏడాది ఎండకాలంలో చేపలను మార్కెటింగ్ ప్రారంభం కాగా మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి చేపలను కొనుగోలు చేశారు. గతేడాది చేపల పెంపకం ఫలితంగా ఐదు వేల టన్నుల చేపల దిగుబడి వచ్చిందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

### ఈ ఏడాది 60 లక్షలు పంపిణీ

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీకి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి పట్టించుకోవడం లేదు. సీజన్‌కు ముందుగానే ప్రణాళికలు తయారు చేసి టెండర్లు పిలిచి సకాలంలో పంపిణీ చేయాల్సింది. కానీ.. వానకాలం ముగిసినా చేప పిల్లల పంపిణీ ప్రారంభంకాలేదు. ఈ ఏడాది 240 చెరువులు 2 ప్రాజెక్టుల్లో చేపల పెంపకం చేపట్టాలని అధికారులు భావించారు. నామమాత్రంగా కేవలం 60 లక్షల చేప పిల్లల పంపిణీ చేయాలని నిర్ణయించారు. చేప పిల్లల పంపిణీ ఆగస్టు నెలలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే 45 రోజుల జాప్యం జరిగింది. చాలా మంది మత్స్యకారులు సొంత డబ్బులతో చేప పిల్లలను కొనుగోలు చేశారు. పిల్లల పంపిణీ సగానికి తగ్గించడంతోపాటు పంపిణీలో జాప్యం కారణంగా తాము ఉపాధి పరంగా నష్టపోవాల్సి వస్తుందని మత్స్యకారులు అంటున్నారు.

### రూ.5 లక్షలతో చేప పిల్లలు కొనుగోలు చేశాం..

*మా మత్స్యకార సొసైటీలో 22 మంది సభ్యులం ఉన్నాం. మేము మత్తడివాగు ప్రాజెక్టులో చేపల పెంపకం చేపడుతాం. గతేడాది వరకు మాకు ఉచితంగా చేప పిల్లలు సరఫరా అయ్యాయి. ఈ ఏడాది పిల్లల పంపిణీలో జాప్యం కావడంతో సొంతంగా పిల్లలను కొనుగోలు చేశాం. ఒక్కొక్కరం రూ.15 వేల చొప్పున రూ.3 లక్షలు జమ చేశాం. మరో రూ.2 లక్షలు అప్పుగా తీసుకు వచ్చినం. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు చేప పిల్లలు సరఫరా కాలేదు.*



*- బొంపల్లి పోచన్న, మత్స్యకారుడు, ఉండం, తలమడుగు మండలం*



తాంసి మండలంలోని మత్తడి ప్రాజెక్టులో నిండుగా నీరు



ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు, విద్యార్థులు

## సారూ.. మమ్మల్ని విడిచి వెళ్లొద్దు

**డప్పు చప్పుళ్లతో హెచ్‌ఎంకు గ్రామస్తులు, విద్యార్థుల వీడ్కోలు**

ఇచ్చోడ, అక్టోబర్ 18 : మండలంలోని సాత్‌మోరిగూడ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు మునేశ్వర్ విజయ్‌కుమార్ సిరికొండ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయనకు గ్రామస్తులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో స్వాగతించి పూలు చల్లారు. సార్.. మా పాఠశాల నుంచి వెళ్లొదంటూ విద్యార్థులు కన్నీరు పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులు మాట్లాడారు. రెండేండ్ల క్రితం పాఠశాలలో పది మంది ఉండేవారని, ప్రస్తుతం 30మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. సిరికొండ, గుడిహత్నూర్ ఎంఈవోలు సునీల్, ఉదయ్‌రావ్, గ్రామ పటేల్ భీంరావ్, సురేశ్, ఈశ్వర్, దేవరి మారుతి, ఆయా పాఠశాలల హెచ్‌ఎం సుమన్, సూర్యప్రకాశ్, ఆనంద్‌రావ్, పాముల గంగారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల నియంత్రణపై ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సిబ్బంది

## మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

**నిజామాబాద్ రేంజ్ నార్కొటిక్ డీఎస్పీ సోమనాథన్**

ఎదులాపురం, అక్టోబర్ 18 : మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం యాంటి నార్కొటిక్ బ్యూరోను ఏర్పాటు చేసిందని నిజామాబాద్ రేంజ్ నార్కొటిక్ డీఎస్పీ సోమనాథన్ అన్నారు. యాంటి నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో పట్టణంలోని నలంద కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత షీ టీం, సైబర్ క్రైమ్ సేవల గురించి ఆయా విభాగాల సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నియంత్రణపై ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలోని లక్ష్మీంపూర్ చెక్‌పోస్టు వద్ద ఇటీవల తొమ్మిది క్వింటాళ్ల గంజాయి పట్టుబడడం సంచలనంగా మారిందన్నారు. స్మగ్లర్లకు జీవత ఖైదు పడవచ్చని, ఈ అక్రమ దందా ద్వారా వారు సంపాదించిన ఆస్తులను రికవరీ చేసుకునే హక్కు చట్టానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సీఐ ప్రసాద్, ప్రిన్సిపల్ పున్నారావ్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 1.5 కేజీల గంజాయి, వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్రలోనే మొట్టమొదటి సారిగా తలమడుగు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.2.25 కోట్ల విలువ గల 900 కిలోల గంజాయితో ఉన్న యుకే 08 సీబీ 5318 నంబర్ గల కంటైనర్‌ను గత నెల 25వ తేదీన ఎస్పీ గౌష్ ఆలం, పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను ఆదిలాబాద్ రూరల్, సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్ అటవీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని బుల్దన జిల్లాకు గంజాయిని సరఫరా చేస్తున్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌కు ముందు ఉన్న ఎస్కాట్ వాహనంలో ఉన్న వారు పరారయ్యారని ప్రాథమిక విచారణలో తెలిందన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ వసీం,(వసీం అన్సారీ), క్లీనర్ అర్మాన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి మహారాష్ట్ర బుల్దన జిల్లాకు చెందిన గోతిరాం గురుదయాల్ సాబ్లే, శుభం గోతిరాం సబ్లే, అమర్‌సింగ్ నారాయణ గోతి, సోమనాథ్ బికా సబ్లేలకు అరెస్టు చేసి తీసుకునిరావడం జరిగిందన్నారు. వారి నుంచి కిలోన్నర గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, వాహనం స్వాధీనం చేసుకుమన్నారు. అరెస్టుకు కృషి చేసిన జైనథ్ సీఐ సాయినాథ్, రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్‌లను ఎస్పీ గౌష్ ఆలం అభినందించి, నగదు రివార్డును ఇచ్చారు.




అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను చూపుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐ, సిబ్బంది


### పరారీలో ప్రధాన నిందితులు

ఈ కేసుకు సంబంధించిన ప్రధాన నిందితులు ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరికి చెందిన ముఖ్యమైన సప్లయర్ ఆశీష్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంపూర్ మీరట్‌కు చెందిన పండిత్ జీలు పరారీలో ఉన్నారని తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న వారిని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

## గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి



మాట్లాడుతున్న నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 : గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-3 పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షకు సంబంధించిన జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ వ్యవహరిస్తారని తెలిపారు. అన్ని జిల్లాల్లో స్ట్రాంగ్ రూంలను గుర్తించాలని, పరీక్షా కేంద్రాల్లో సరిపడా ఫర్నిచర్, విద్యుత్, ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి అన్ని సౌకర్యాలు సరి చూసిన తర్వాతనే అనుమతులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయకర్త రెడ్డి పాల్గొన్నారు.

### పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు..

ఎదులాపురం, అక్టోబర్ 18 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ద్వారా నవంబర్, డిసెంబర్‌లలో నిర్వహించనున్న గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. నవంబర్ 17, 18వ తేదీల్లో జరిగే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 రాత పరీక్షలను పురస్కరించుకుని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జగ్గారం పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల గురించి తెలుసుకోవాలి

- విద్యార్థులు చరిత్ర కలిగిన ప్రదేశాలను సందర్శించాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా చాలా పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటి గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన ఫొటోఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. పర్యాటక రంగం, చరిత్రపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, ప్రతి ఒక్కరూ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. పర్యాటక రంగ ప్రాధాన్యత, దాని ద్వారా జరిగే ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ప్రదేశానికి విశిష్టత ఉందని, విద్యార్థులు వాటిని తప్పకుండా సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యటక శాఖ ద్వారా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఫొటో ఎగ్జిబిషన్‌లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెమొంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, డీఈవో ప్రణీత, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీపీఆర్వో తిరుమల పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ఫొటోలను తిలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## ట్రిపుల్ ఐటీని అభివృద్ధి చేస్తాం

**ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్**

బాసర, అక్టోబర్ 18 : బాసర ట్రిపుల్ ఐటీని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని నూతన ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం బాసర ట్రిపుల్ ఐటీకి చేరుకున్న ఆయనకు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రణధీర్ సాగి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డీన్‌లు, అధికారులు, సిబ్బంది ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్య అభివృద్ధిని పెంచేందుకు అవసరమైన నూతన కోర్సులను ఏర్పాటుకు నిర్ణయాలు పడతామని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గోవర్ధన్